సాక్షి
వికారాబాద్
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



చతికిలపడ్డ సంఘాలు

ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన మహిళా పరస్పర సహకార పొదుపు సంఘాలు నేడు చతికిల పడ్డాయి. 8లో▸



మహిళా దొంగ అరెస్ట్

కొడంగల్ బస్టాండ్‌లో గొలుసు దొంగత నాలకు పాల్పడుతున్న మహిళను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. 8లో▸



ఉగ్రమూకలను..

ఉగ్రవాద దాడులను ఖండిస్తూ జిల్లాలో ఆదివారం పలు సంఘాలు శాంతియుత ర్యాలీలు నిర్వహించాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేడు ధారూరుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించే భూ భారతి అవగాహన సదస్సుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరుకానున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. మండలంలోని రైతులు హాజరు కావాలని తహసీల్దార్ సాజిదాబేగం కోరారు.

శ్రీవారికి పూలంగి సేవ



ప్రత్యేక అలంకరణలో మూలమూర్తి

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూలంగి సేవ నిర్వహించారు. మూలమూర్తిని అర్చకులు పలు రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగడి అగ్గువ

సంతల్లో భారీగా తగ్గిన కూరగాయల ధరలు



బొంరాస్‌పేట సంతలో కూరగాయల విక్రయం

బొంరాస్‌పేట: కూరగాయలు, ఆకుకూరల ధరలు భారీగా తగ్గాయి. వారం రోజుల క్రితం వరకు కిలో రూ.50 నుంచి రూ.100 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా సగానికి సగం తగ్గాయి. గత ఆదివారం బొంరాస్‌పేట, తుంకిమెట్ల సంతల్లో కిలో టమాటా రూ.20 ఉండగా ఈ వారం రూ.5 పలికింది. ఉల్లిగడ్డ రూ.30 ఉండగా ప్రస్తుతం రూ.15, క్యారెట్, బీర, కాకర, వంకాయ తదితరల కూరగాయల ధరలు భారీగా తగ్గాయి. గత వారం ఆలుగడ్డ, పచ్చిమిర్చి రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.40 తగ్గి రూ.60లకు విక్రయిస్తున్నారు. ఆకుకూరలు సైతం సగానికి సగం తగ్గాయి. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లు పక్కదారి



కిరాణా దుకాణంలో అంగన్‌వాడీ కోడిగుడ్లు

కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన కోడిగుడ్లు బహిరంగ మార్కెట్‌లో దర్శనమిచ్చాయి. ఈ ఘటన మండలంలోని చౌడాపూర్‌లో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం ఉదయం పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో తనిఖీలు చేశారు. అక్కడ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన 23 కోడిగుడ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని మండల, ఐసీడీఎస్ అధికారులకు తెలియజేడం జరిగిందని రాజిరెడ్డిని తెలిపారు.

నేడు వాహనాల వేలం

మోమిన్‌పేట: నిషేధిత సరుకులు రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సహదేవుడు తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. రెండు కార్లు, ఒక చేతక్, రెండు ఆటోలు, ఒక బైక్, ఒక స్కూటీకి వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలి బూడిదైన సామగ్రి

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం చాకల్‌పల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మల్కమ్మ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మల్కమ్మ వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో సామగ్రి, వస్తువులు, ఆహార పదార్థాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు మంటలను ఆర్పారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత మహిళ కోరింది.



బంట్వారం: కోట్‌పల్లిలో గులాబీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



తాండూరు: బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



బొంరాస్‌పేట: వరంగల్ సభకు బయలుదేరిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఘనంగా బీఆర్‌ఎస్ రజతోత్సవం

బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ప్రధాన వీధుల్లో.. పార్టీ కార్యాలయాల్లో గులాబీ జెండాలను ఆవిష్కరించారు. కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమని పలువురు కొనియాడారు. ఆయన బాటలోనే తామందరం నడుస్తామని పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ హోరెత్తించారు. అనంతరం వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లారు.

అధికార పార్టీలో అంతర్గత పోరు



- బషీరాబాద్ మండలంలో నేతల కుమ్ములాటలు
- బిచ్చిరెడ్డి ఘటనతో బయటపడ్డ తగాదాలు
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన ఓ సామాజిక వర్గం నేతలు
- మూడు రోజుల్లో ముఖ్య నేతల సమావేశానికి జీఎంఆర్ ఆదేశం

బషీరాబాద్: మండలంలో అధికార పార్టీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఊరూరా కాంగ్రెస్ నేతలు తమ శ్రేణులతో వేరు కుంపట్లు ఏర్పాటు చేసి రాజకీయ మంటలు రాజేస్తున్నారు. పార్టీలో పాత, కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదురక ఏకంగా ఓ నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది. దీనంతటికీ మండలానికి చెందిన ఓ సీనియర్ నాయకుడే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీకి నష్టం కలిగిస్తున్నాడని మండలంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులంతా ఏకమై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు రంగంలోకి దిగిన ఎమ్మెల్యే మూడు రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఆదేశించారు.

కాంగ్రెస్‌కు కంచుకోట..

బషీరాబాద్ మండలం మొదటినుంచీ కాంగ్రెస్‌కు కంచుకోట. రాజకీయ ఉద్దండుల పుట్టినిల్లు. మాజీ మంత్రులు మాణిక్‌రావు, చందుమహారాజ్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు, పైలెట్ రోహిత్‌రెడ్డి వంటి స్థానిక నాయకులు దశాబ్దాల పాటు తాండూరును పాలించారు. అంతటి చరిత్ర కలిగిన కాంగ్రెస్‌లో స్థానికంగా కుమ్ములాటలు మొదలయ్యాయి.

అంతా ఆ నాయకుడి తోనే..!

పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రధాన అను చరుడుగా కొనసాగుతున్నారు. రెండుసార్లు అతడి సతీమణి కరుణ ఎంపీపీగా పనిచేశారు. అయితే మండలంలోని తమతమ గ్రామాల్లో అతడికి అనుకూలంగా ఉన్న కార్యకర్తలతో వేరు కుంపట్లు ఏర్పాటు చేసి, గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని బలమైన ఓ సామాజికవర్గం నాయకులంతా విమర్శలు చేస్తున్నారు. ఇందుకు బిచ్చిరెడ్డి ఆత్మహత్యాయత్నాన్ని ఉదహరిస్తున్నారు. ఇదే విషయమై రెండు రోజుల క్రితం మండలానికి చెందిన సీనియర్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, మాధవరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో భేటీ అయినట్లు తెలిసింది. పరిస్థితిని చక్కదిద్దకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నష్టం తప్పదని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. అయితే త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని ఎమ్మెల్యే సర్దిచెప్పారు. అప్పటి వరకు పార్టీ లైన్ ఎవరు దాటినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇదిలా ఉండగా తన కుటుంబం నిరంతరం ప్రజల్లో ఉండి సేవ చేస్తోందని, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయత్వాన్ని బలపర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని అజయ్‌ప్రసాద్ తెలిపారు. తనపై నిందలు మోపడం అన్యాయమని, ఎవరెన్ని కుట్రలు చేసినా ధైర్యంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

వాల్టా.. పల్టా



పరిగి మండలంలో అనుమతి లేకుండా వేస్తున్న బోరు

జిల్లాలో యథేచ్ఛగా బోరుబావుల తవ్వకం

- అనుమతులు పదుల్లో.. డ్రిల్లింగ్ వేలల్లో..
- గత ఏడాది నాలుగింటికే పర్మిషన్
- 80 పైచిలుకు బోరు బండ్లు
- రిజిస్ట్రేషన్ చేసుకున్నవి ఏడు మాత్రమే..
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

వికారాబాద్: జిల్లాలో ఎలాంటి అనుమతులు పొందకుండా ఏటా వేల సంఖ్యలో బోరుబావులు తవ్వుతూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. గత ఏడాది అధికారికంగా నాలుగు బోర్ల తవ్వకోవడానికి మాత్రమే అనుమతులు వచ్చాయి. కానీ రోజుకు సగటున 300లకు పైగా డ్రిల్లింగ్ వేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఏటా 2,500 నుంచి 3,000ల వరకు బోర్లు వేస్తున్నారు. బోర్లు వేసే సమయంలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం లేదు. దీంతో 30శాతం వాటిలో మాత్రమే నీళ్లు పడుతున్నా యి. చాలా మంది రైతులు మూఢనమ్మకాలతో నీటి లభ్యత తెలుసుకునే ప్రయత్నం చేసి చేతులు కాల్చుకుంటున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అప్పులపాలవుతున్నారు. సాధారణంగా బోరు బా వి తవ్వాలంటే తప్పని సరిగా ప్రభుత్వ అను మతి పొందాలి. కానీ వేల సంఖ్యలో బోర్లు వేస్తున్నా ఒక్కశాతం కూడా అనుమతులు తీసుకోవడంలేదు. రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ బోర్ల దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో రికార్డు స్థాయిలో వానలు పడుతున్నా మార్చి నాటికి భూగర్భ నీటిమట్టం అదే స్థాయిలో పడిపోతోంది. ఏటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే విపరీతంగా ఉన్న బోరుబావులు, విచ్చలవిడిగా నీటి వాడకం కారణంగా ఏప్రిల్, మే మాసాల్లో పంటలు ఎండబెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం జిల్లాలో లక్షకు పైగా వ్యవసాయ బోరుబావులు ఉండగా 25 వేల పైచిలుకు ఇళ్ల అవసరాల కోసం తవ్విన కనెక్షన్లు ఉన్నాయి.

కేవలం నాలుగింటికే..

బోరుబావి తవ్వాలంటే తప్పని సరిగా భూగర్భ జలవనరులశాఖ నుంచి అనుమతి పొందాలి. వాల్టా చట్టం ప్రకారం ముందుగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. వారు భూగర్భ జల వనరుల శాఖకు రెఫర్ చేస్తారు. ఆ శాఖ జియాలజిస్టులు వచ్చి నీటి లభ్యతను పరిశీలించి నీళ్లు ఉన్నాయని నిర్ధారణ అయితే అనుమతి ఇస్తారు. ఆ తరువాత బోరు వేసుకోవాలి. కానీ ఈ పద్ధతి ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో నెలకు సగటున 300ల పై గా బోర్లు తవ్వుతున్నట్లు అంచనా.. ఈ లెక్కన ఏటా 2,500 నుంచి 3,000 బోర్లు వేస్తున్నట్లు సమాచారం. కానీ గత ఏడాది కాలంలో కేవలం నాలుగంటే నాలుగింటికి మాత్రమే భూగర్భ జల వనరుల శాఖ నుంచి అనుమతులు పొందారు. అలాగే ప్రతి బోరు బండికి భూగర్భ జలవనరుల శాఖ జిల్లా కార్యాలయంలో రిజిస్ట్రర్ చేయించుకోవాలి. కానీ జిల్లాలో 80 పైచిలుకు బోరు బండ్లు ఉన్నా కేవలం ఏడు వాహనాలకు మాత్రమే రిజిస్ట్రర్ చేసుకున్నారు.

అవగాహన లేక..

బోరుబావులు తవ్వే రైతులు నేటికీ మూఢ నమ్మకాలనే పాటిస్తున్నారు. ఇప్పటికీ 70 శాతం మంది రైతులు కొబ్బరికాయతో, ఇతర మంత్ర తంత్రాలు చేసే వారి ద్వారా నీటి లభ్యతను తెలుసుకుంటున్నారు. కనీస అవగాహన లేక పదుల సంఖ్యలో బోర్లు తవ్వించి అప్పులపాలవుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా జియాలజిస్టులు చూపుతున్న పాయింట్లలో సైతం సగానికిపైగా నీళ్లు పడటం లేదు.

నిబంధనలు గాలికి..

జిల్లాలో లక్ష పైచిలుకు వ్యవసాయ బోరుబావులు, 25 వేల పైచిలుకు ఇంటి బోర్లు ఉన్నాయి. 12 వేల వరకు అనుమతి లేని బోరువులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక బోరుబావికి మరో బోరుబావి మధ్య కనీసం 80 మీటర్ల దూరం ఉండాలి. అదే ప్రజావసరాలకు వినియోగించే బోరుబావికి అయితే 250 మీటర్ల దూరం పాటించాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే 1000 ఫీట్ల వరకు డ్రిల్లింగ్ చేస్తున్నారు.

అనుమతులు తప్పనిసరి



బోరుబావులు తవ్వే వారు తప్పని సరిగా అనుమతులు పొందాలి. లేదంటే సంబంధిత యజమాని తోపాటు బోరు బండి నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా బోర్లు వేస్తుంటే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలి. అలాగే నీటి లభ్యత తెలుసుకునేందుకు రైతులు అశాస్త్రీయ పద్ధతులు వీడాలి. బోరు కోసం దరఖాస్తు చేసుకుంటే నీటి లభ్యతను పరిశీలించి అనుమతులు ఇస్తాం.

– రవిశంకర్, భూగర్భ జలవనరుల శాఖ జిల్లా అధికారి

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- బొలెరో.. కారు ఢీ
- ముగ్గురి దుర్మరణం
- కొడంగల్ మండలంలో ఘటన

కొడంగల్ రూరల్: ఎదురెదురుగా వస్తున్న బొలెరో.. కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ఘటన కొడంగల్ మండలం అయినన్‌పల్లి స్టేజ్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన రామారావు(51) హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఏడాది కాలంగా నివాసం ఉంటున్నారు. ఇతనికి భార్య శారద, కుమారుడు అనిష్ ఉన్నారు. శనివారం పని మనిషి శ్రీలత(42), ఆమె మూడో కూతురు శ్రుతి(12)తో కలిసి కారులో కర్ణాటకలోని గంగాపూర్‌లో గల దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లారు. ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొడంగల్ మండలం అయినన్‌పల్లి గేటు సమీపంలోకి రాగానే కొడంగల్ నుంచి లక్ష్మీపల్లికి వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శ్రీలత అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రులు శ్రుతి, రామారావును హైవే అంబులెన్సులో కొడంగల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా రామారావు మృతిచెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రుతి మృతి చెందింది. ఇదిలా ఉండగా కొడంగల్ మండలం పర్సాపూర్‌కు చెందిన శ్రీలతకు పెద్దేముల్ మండలం మంబాపూర్‌కు చెందిన కృష్ణప్పతో వివాహం జరిగింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటూ ఇళ్లలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రామారావు ఇంటో శ్రీలత పని చేస్తోంది. దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామారావు, శ్రీలత, శ్రుతి మృతి చెందారు. బొలెరో వాహన డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన కారు



ఆస్పత్రిలో శ్రుతి మృతదేహం



రామారావు మృతదేహం



ఘటనా స్థలంలో విగతజీవిగా శ్రీలత



మాట్లాడుతున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

షాబాద్: దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం బాధాకరమని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండలపరిధిలోని నాగర్‌కుంటలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, నిర్మాణాలు, అభివృద్ధి విషయంలో వివక్ష ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా అన్నింట్లో వివక్ష చూపడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ, బీజేపీ నాయకులు ఉగ్రవాద ఘటన నుంచి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజలంతా ఉగ్రవాదంపై ముక్త కంఠంతో నినదించాలని అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా సభలు, సమావేశాలు నిర్వహించాలని కేడర్‌కు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ కార్యదర్శి కె.రమస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు ఆనందం, నర్సింహులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాలతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మార్కుల ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈ ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మే 15వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలని భావించిన ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా కె.శశాంకను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్మన్‌గా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఆర్థిక, పరిశ్రమల, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శుల తోపాటు హెచ్‌ఎండీఏ కమిషనర్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, కలెక్టర్, డీటీసీపీ హైదరాబాద్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ సభ్యులుగా ఉండనున్నట్లు ప్రకటించింది. 56 రెవెన్యూ విలేజీలతో పాటు 765.25 స్క్వేయర్ కిలోమీటర్ల పరిధిలో 12 జోన్లుగా విభజించి ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను తొలగించి, ఫ్యూచర్‌సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీలో విలీనం చేసింది. ఫ్యూచర్ సిటీ ఏర్పాట్లలో భాగంగా 13,500 ఎకరాలు సేకరించింది. మరో 15 వేల ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు గ్రీన్ కారిడార్ ఎలివేటెడ్ రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లా కలెక్టర్‌గా పని చేసి వెళ్లిన శశాంకను ఎఫ్‌సీడీఏ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిస్వార్థ రాజకీయ వేత్త వాజ్‌పేయ్

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

పరిగి: నిస్వార్థ రాజకీయ వేత్త అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలను ఆదివారం పరిగి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాజ్‌పేయ్ దేశ అభ్యున్నతి కోసం ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాల కన్వీనర్ రాము యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, నాయకులు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాము నిపల్లికి చెందిన కృష్ణయ్య, గోవింద్, నరసింహులు బైక్‌పై తిరుమలగిరి నుంచి గ్రామానికి వస్తుండగా కాలమ్మ ఆలయ సమీపంలో మొత్కూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి బైక్‌పై సంచర్ల వైపు వెళ్తున్న క్రమంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను(42) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

సనత్‌నగర్: కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా ఇంట్లోకి చొరబడి మహిళను రక్తం కారేలా కొట్టి తీవ్రంగా గాయపర్చిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్ డీఎస్‌ఎం కాలనీకి చెందిన రైసా నాజియా (40) ఈ నెల 26న ఉదయం 10 గంటల సమయంలో తాను ఇంట్లో ఉండగా ఆమెకు తెలిసిన వ్యక్తులైన మహ్మద్ సులేమాన్ రాజా, ముబీన్ సుల్తానా, షబానాతో పాటు మరికొంతమంది వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఒక్కసారిగా దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమె ముఖం, ముక్కు.. పెదవులపై చేతులు వేస్తూ, గొంతు నొక్కుతూ దాడికి పాల్పడ్డారు. సులేమాన్ రాజా అనే వ్యక్తి ఆమె తలపై బ్యాట్‌తో కొట్టగా తీవ్ర రక్తస్రావం అయ్యింది. అదే సమయంలో రైసా నాజియా బావమరిది వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా బ్యాట్‌తో దాడి చేసి రక్తం కారేలా కొట్టారు. బాధితురాలు నిందితులపై చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితులపై బీఎస్‌ఎస్ 329(4), 118 (1), 352, 351 (2) రెడ్‌విత్ 3(5) కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ శిక్షణ అవసరం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ శిక్షణ అవసరమని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30 ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరానికి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరికీ కనీస సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. ఈ నేపథ్యంలోనే ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణలో బేసిక్ కంప్యూటర్ అవగాహన, టైపింగ్, రైటింగ్ స్కిల్స్, సీ లాంగ్వేజ్ తదితర అంశాలను నేర్పించనున్నామన్నారు. ప్రాక్టికల్ శిక్షణతో పాటు ప్రతి శిక్షణార్థులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. అవసరమైన వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్, మానవ సేవే మాధవ సేవా డైరెక్టర్ హేమలత పాల్గొన్నారు.

'ఏ' కథా సంపుటి ఆవిష్కరణ

సాక్షి, సిటీ బ్యూరో: రిటైర్డ్ పోలీస్ అధికారి, రచయిత చిలుకూరి రామ ఉమామహేశ్వర శర్మ రాసిన 'ఏ' కథా సంపుటిని పలువురు సాహితీ వేత్తలు ఆవిష్కరించారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్, రచయితలు ఖదీర్ బాబు, అనిల్, మానస ఎండ్లూరి, కుప్పిలి పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 'ఏ' కథా సంపుటిలో వైవిధ్యం, వాస్తవికత, మానవీయత కలిగిన కథలు ఉన్నాయని కొనియాడారు. ఈ కథల్లో స్త్రీ, పురుష సంబంధాల గురించి స్వేచ్ఛగా వ్యక్తపరచడం పాఠకులను ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు. కథలన్నీ ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. స్త్రీ, పురుష సంబంధాల పట్ల, సమాజం నిర్మించిన నైతిక చట్రపు విలువలను, సంబద్ధతను రచయిత నిశితంగా ప్రశ్నించారని వివరించారు. ఒకే మూసలో ఒదగని ఈ కథలు చెప్పేతీరు కూడా కథ కథకి మారుతుందన్నారు. కాగా ఉమామహేశ్వర శర్మ పదవీ విరమణ చేశాక రాసిన రెండో పుస్తకం 'ఏ' కథలు. ఆయన మొదటి పుస్తకం 'నేనూ శాంత కూడా-ఓ జీవన కథ' ఇప్పటికే పాఠకుల ఆదరణ పొందింది.

ఉద్యాన పంటలను సాగు చేయాలి

చేవెళ్ల: రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి, విరివిగా లాభాలు సాధించాలని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం సైంటిస్టులు, విద్యార్థులు అన్నారు. ఆదివారం మండలంలోని కందవాడ గ్రామంలో సైంటిస్టులు, ప్రొఫెసర్‌లతో కలిసి మోజర్ల 2021 బ్యాచ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటల సాగుతో పాటుగా సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పచ్చిరొట్ట, బహుళ అంచెల పంట, పట్టు పురుగుల పెంపకం, బిందు సేద్యం తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్టులు డా.జ్యోతి, ప్రణీత్‌కుమార్, అసిస్టెంట్ ప్రొ.డా.శ్రీనివాస్, విద్యార్థులు స్వాతి, అఖిల, సంతోష, సానియా తదితరులు పాల్గొన్నారు.

చతికిలపడ్డ మహిళా సంఘాలు



బొంరాస్‌పేటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం



గౌరారం గ్రామ సంఘం సమావేశం

- నెలవారీ సమావేశాలు శూన్యం
- అంతా ఐకేపీ, ఎంఎంఎస్ కార్యవర్గం కనుసన్నల్లోనే
- నేడు మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం

బొంరాస్‌పేట: ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక మండల మహిళా సమాఖ్య ఆదర్శంగా నిలిచింది. అప్పటి ముఖ్యమంత్రి సైతం మండలానికి వచ్చి ప్రశంసించారు. కానీ, ప్రస్తుతం మహిళా పరస్పర సహకార పొదుపు సమాఖ్య లిమిటెడ్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలు చతికిలపడ్డాయి. గ్రామాల్లోని చిన్న సంఘాల సమావేశాలు నిర్వహించడం లేదని సదరు సంఘాల ప్రతినిధులు, చిత్తశుద్ధి ఉన్న సీనియర్ నాయకురాళ్లు వాపోతున్నారు. తమ వేతనాలు, మొక్కుబడి ప్రగతిని చూపించుకునేందుకు అంతా ఐకేపీ సిబ్బంది, ఎంఎంఎస్ కార్యవర్గం కనుసన్నల్లోనే కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. కొన్ని చోట్ల తగాదాలతో స్వయం సహాయక, గ్రామ సంఘాలు మూతబడ్డాయి.

ఆశయం నిరాశ

సహకార సూత్రాలకు అనుగుణంగా పొదుపుతో స్వయం సహాయక సహకారాలను ప్రోత్సహిస్తూ సభ్య మహిళా సంఘాలను ఆర్థికంగా, సాంఘికంగా, సామాజికంగా ఎదిగి పేదరికాన్ని నిర్మూలించేందుకు ఏర్పడిన సమాఖ్య ఆశయం ప్రస్తుతం నిరాశ కలిగిస్తోంది. ప్రస్తుత సంఘాల నిర్వహణ, పర్యవేక్షణలేని దుస్థితిలో ఉండగా, కొత్త సంఘాల ఏర్పాటులో మరింత వెనకబడి ఉందని తెలుస్తోంది. గౌరారం, బురాన్‌పూర్‌లో ఉన్న మొత్తం మూడు వీఓలు మూలనపడగా పనితీరు శూన్యంగా మారిందని సభ్యులు చెబుతున్నారు.

సరిగ్గా పాతికేళ్ల క్రితం

మహిళలు సమైక్యమై స్వయంగా తమ జీవితాలు మెరుగు పర్చుకునేందుకు ఈ మండల మహిళా సమాఖ్య సరిగ్గా పాతికేళ్ల క్రితం 2000 సంవత్సరం జూన్ 28న ఏర్పాటైంది. యూఎన్‌డీపీ, సెర్ప్ సహకారంతో పెద్ద ఎత్తున నిర్వహణ సాగింది. ఇప్పటికే దుప్‌చర్ల, బురాన్‌పూర్, జానకంపల్లి, మహిళా సంఘాలకు ఆర్థికంగా నిధులు, ప్రభుత్వం పాఠశాల, అంగన్‌వాడీల విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టడం, వ్యవసాయ కార్యక్రమాలు, సాంకేతిక ఉపాధి శిక్షణ, వృత్తి విద్యా శిక్షణ నిర్వహిస్తున్నప్పటికీ సంఘాల నిర్వహణలో వెనుకపాటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. నెలవారీ సమావేశాలు శూన్యమై ప్రభుత్వ నిధులు కార్యక్రమాలకే పరిమితం అవుతున్నాయి. సర్వసభ్య సమావేశం సోమవారం జరగనుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత తెలిపారు.

క్లస్టర్లు:	7
సమాఖ్య పరిధిలోని జీపీలు:	47
గ్రామ సంఘాలు(వీఓలు):	45
స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు):	840
సభ్యులు:	9,124
దివ్యాంగుల సంఘాలు:	26
సభ్యులు:	240
సొంత భవనాల వీఓలు:	10
సీసీలు, ఏపీఎం:	5+1

గ్రామాల్లో నిర్వీర్యం



చిన్న సంఘాలు బుక్ కీపర్లతో చలాకీతనంతో పొంతనలేని వసూళ్లు చేస్తున్నారు. మునుపటి తీరుగా పనిచేయడం లేదు. ఐదేళ్లుగా ఆదర్శంగా పని చేశాను. అప్పటి కార్యవర్గం ఆదర్శంగా ఉంది. మళ్లీ చైతన్యం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

– హన్మమ్మ, ఎంఎంఎస్ మాజీ కార్యదర్శి, గాజులకుంటతండా

నిరంతరం పనిచేయాలి



అక్కడక్కగా కొన్ని గ్రామ సంఘాలు సక్రమంగా పని చేయడంలేదు. దీంతో సీసీలకు వేతనాలు రావు. ఏడు గురికి ఐదుగురు సీసీలు పనిచేస్తున్నారు. ఖాళీగా ఉన్న రెండు సీసీ పోస్టులను భర్తీ చేయాలని అధికారులకు చెప్పాం. మరో 15రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుంది.

– అనిత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

త్వరలో సమీక్షిస్తాం



10 గ్రామసంఘాలు పని చేయడం లేదు. శ్రీనిధి వసూళ్లు సక్రమంగా లేవు. ఈ మధ్య సంఘాల వెనుకబాటు వాస్తవమే. ఖాళీలను వచ్చేనెలలో పూర్తి స్థాయిలో భర్తీ చేస్తాం. బదిలీలు, కొత్తవారి నియామకం ఉంటుందని ఉన్నతాధికారులు చెప్పారు.

– సాయన్న, ఏపీఎం, బొంరాస్‌పేట



ఘనంగా బోనాల ఊరేగింపు

మోమిన్‌పేట: మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో బీరప్ప జాతరలో భాగంగా ఆదివారం బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను నెత్తిన పెట్టుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాల్వ నిర్మాణంలో ఘర్షణ

- రెండు కుటుంబాల మధ్య తీవ్ర వాగ్వాదం, పరస్పర ఫిర్యాదులు
- అలసటకు గురై ఛాతిలో నొప్పితో హోంగార్డ్ మృతి

యాచారం: రెండు ఇళ్ల మధ్యన డ్రైనేజీ కాల్వ నిర్మాణం విషయంలో తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి. తీవ్ర అలసటకు గురైన ఓ హోంగార్డ్ ఛాతిలో నొప్పితో మృతి చెందాడు. ఈ సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకటేశ్(35) నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతని బంధువులు ప్రశాంత్, పవన్ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. వీరి ఇళ్ల పక్కన డ్రైనేజీ కాల్వ నిర్మాణం విషయంలో ఆదివారం ముగ్గురి మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి. అనంతరం ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేయడానికి యాచారం ఠాణాకు వెళ్లారు. ఫిర్యాదు రాస్తుండగా వెంకటేశ్‌కు ఛాతిలో నొప్పి రావడం ప్రారంభమైంది. తనకు ఛాతిలో నొప్పి వస్తోందని భార్య స్వాతికి తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలిస్తుండగా వెంకటేశ్ మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, పాప, బాబు ఉన్నారు. డ్రైనేజీ కాల్వ నిర్మాణం విషయంలో ప్రశాంత్, పవన్ కలిసి తీవ్రంగా కొట్టడం వల్లే వెంకటేశ్ మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. గునుగల్‌లో తీవ్ర ఉద్రిక్తత నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చేపలు పట్టడానికి వెళ్లి.. కుంటలో పడి..

శంకర్‌పల్లి: ఓ వ్యక్తి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌కి చెందిన గడ్డం లక్ష్మయ్య (44) సెంట్రింగ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం భోజనం చేసిన తర్వాత బయటకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులు బుల్కాపూర్ శివారులోని కుంటలో మృతదేహం పడి ఉండడం చూసి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని మృతదేహన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. లక్ష్మయ్య చేపలు పట్టడానికి వెళ్లి, మూర్ఛవ్యాధి ఉండడంతో ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

శంషాబాద్: ఏటీఎంలో చోరీకి యత్నించిన సంఘటన చోటు శంషాబాద్ పట్టణంలో చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బస్టాండ్ ఎదురుగా జాతీయరహదారి పక్కన ఉన్న సౌండి ఇండియా ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించిన హెల్మెట్ ధరించి వ్యక్తి ముందుగా అక్కడ సీసీ కెమెరాల వైర్లు తొలగించాడు. మరికొన్ని వైర్లు కత్తిరిస్తుండగా అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.85 లక్షలు చోరీ

సనత్‌నగర్: కూరగాయల వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.1,85,000లు చోరీ చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. భరత్‌నగర్ కాలనీ జేపీనగర్‌కు చెందిన భోగేశ్వరరావు భరత్‌నగర్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. గత మూడు రోజుల క్రితం భోగేశ్వరరావు స్వగ్రామానికి వెళ్ళాడు. స్వగ్రామానికి వెళ్లే సమయంలో పూజ గదిలో రూ.25,000, అల్మరాల్లో వేర్వేరు చోట్ల రూ.లక్షా అరవై వేలు ఉంచాడు. ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు భోగేశ్వరరావు కుమారుడు పెద్ద కేశవరావు ఇంటికి తాళం వేసి కీని విద్యుత్ మీటరుపై పెట్టి భరత్‌నగర్ మార్కెట్‌కు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చిన పెద్ద కేశవరావు పూజ చేస్తుండగా గదిలో ఉంచిన రూ.25 వేల నగదు కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి ఇంట్లో అల్మరాలో ఉంచిన నగదు చూడగా అవి కూడా కనిపించలేదు. కరెంటు మీటరుపై ఉంచిన కీ తీసుకుని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నగదును దొంగిలించి యథాప్రకారం తాళం చెవులను అక్కడే ఉంచి వెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో యువతిని మోసగించిన సెక్యూరిటీ గార్డు

సనత్‌నగర్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన సెక్యూరిటీగార్డ్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా గోతిలగుట్ట తాండాకు చెందిన రమావత్ ఈశ్వర్ బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చాడు. మోతీనగర్‌లో ఉంటూ అమీర్‌పేటలోని ఓ షాపింగ్ మాల్‌లో గత రెండున్నర సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అదే షాపింగ్ మాల్‌లో పనిచేసే యువతి (24)తో ఈశ్వర్‌కు పరిచయం ఏర్పడింది. నువ్వంటే ఇష్టమని, వివాహం చేసుకుంటానని ఆ యువతికి చెప్పాడు. మొదట అందుకు ఆమె నిరాకరించగా, ఒత్తిడి చేసి వివాహానికి ఒప్పించాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చింది. దీంతో తనను పెళ్లి చేసుకోమని కోరగా, గర్భం దాల్చితే ఇంట్లో వాళ్లు ఒప్పుకోరని చెప్పి ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఆమెకు బలవంతంగా గర్భ నిరోధక మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమెకు గర్భస్రావం జరిగింది. ఆ తర్వాత నుంచి ఈశ్వర్ ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంచాడు. మార్చి 18న ఆ యువతి, ఈశ్వర్, ఆతని తల్లి..గ్రామ పెద్దలు, సర్పంచ్‌ల సమక్షంలో పెళ్లి విషయమై మాట్లాడారు. వారి సమక్షంలో ఈశ్వర్ ఆమెను వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయినప్పటికీ వివాహం చేసుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకు తిరుగుతుండడంతో శనివారం ఆ యువతి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై బీఎస్‌ఎస్ సెక్షన్ 69 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా దొంగ అరెస్ట్

- ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు
- రెండు గొలుసుల అపహరణ
- రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీధర్‌రెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని బస్టాండులో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. ఈ నెల 25న టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన రాములమ్మ తాండూరు బస్సు ఎక్కుతున్న క్రమంలో ఆమె మెడలోని గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు కొట్టేశారు. అదే రోజు దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన నారాయణమ్మ మహబూబ్‌నగర్ బస్సు ఎక్కుతుండగా ఆమె గొలుసునూ దొంగిలించారు. ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కొడంగల్ బస్టాండులో ప్రత్యేక నిఘా ఉంచారు. ఆదివారం పరిగి పట్టణం తుంకుల్‌గూడకు చెందిన కావలి అనంతమ్మ అనే మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా తానే బంగారు గొలుసులు కొట్టేసినట్లు ఒప్పుకుంది. ఆమె నుంచి నగలు రికవరీ చేసినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. కావలి అనంతమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

రాజేంద్రనగర్: తెలంగాణలో త్వరలోనే గుజరాత్ తరహాలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని అందుకు అనుగుణంగా బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్ శివరాంపల్లి ప్రజా భవన్‌లో నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ ఒకే గూటి పక్షులన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని... అలాగే బీఆర్‌ఎస్ ఓటింగ్ దూరంగా ఉంటూ మజ్లిస్‌కు అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. సభలతో బీఆర్‌ఎస్ ప్రజలకు చేసేది ఏం లేదన్నారు. రూ. లక్ష కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మరన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్లల్లో రూ. 8 లక్షల కోట్ల అప్పు చేసి బీఆర్‌ఎస్ ప్రజలను ముంచిందన్నారు. కాంగ్రెస్‌కు నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచిందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మరన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కాశ్మీర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేసిందన్నారు. ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను నిర్మించిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2 కోట్ల 30 లక్షల మంది కాశ్మీర్‌ను సందర్శించారని గుర్తు చేశారు. పహల్గాం దాడిని ప్రతి భారతీయుడు ఖండిస్తున్నారని... తగిన గుణపాఠం తప్పదన్నారు. నిరుపేద ముస్లింల అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కొందరి చేతుల్లో వక్ఫ్ బోర్డు భూములు ఉండటంతో వాటి ప్రతిఫలాన్ని అనుభవిస్తున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టం ద్వారా నిరుపేద ముస్లింలందరికి లబ్ధి చేకూరడం ఖాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకం కాదని... తీవ్రవాదానికి, దేశ ద్రోహులకు వ్యతిరేకమన్నారు. ఇదే విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులకు వివరించాలన్నారు.

మరో ముగ్గురు..

- నగరం విడిచి వెళ్లిపోయిన పాకిస్థానీలు
- భారత్ టు పాకిస్థాన్ వయా దుబాయ్

సాక్షి, సిటీబ్యూరో: పహల్గాం ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిణామాలతో ప్రస్తుతం భారత్– పాకిస్థాన్ మధ్య విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కేంద్రం నిర్దేశించిన గడువు మేరకు నగరం వదిలి వెళ్లాల్సిన షార్ట్ టర్మ్ వీసా (ఎస్‌టీవీ) కలిగిన పాకిస్థానీయులు ప్రస్తుతానికి 'మూడో దేశం' చేరారు. ఈ తరహా వీసాలపై నగరానికి వచ్చిన నలుగురూ ఆదివారం సాయంత్రానికి దేశం వదిలారు. సిటీలో ఉన్న నలుగురిలో ఓ పురుషుడు శనివారం వెళ్లిపోగా... ఇద్దరు మహిళలు, చిన్నారి ఆదివారం విమానం ఎక్కారు. పాకిస్తాన్‌కు నేరుగా విమానాలు లేకపోవడంతో భారత్– పాక్ బోర్డర్‌కు చేరుకునే ఆ దేశంలోకి ప్రవేశించాలి. నగరం నుంచి ఈ సరిహద్దులు దూరం కావడంతో.. ఎల్‌టీవీపై వచ్చిన వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివారం రాత్రికి దేశం వదిలి వెళ్లడం అనివార్యం కావడంతో ప్రత్యామ్నాయాలు అన్వేషించారు. దీంతో నలుగురు పాకిస్థానీలు (ఓ చిన్నారి సహా) నగరం నుంచి దుబాయ్ వెళ్లారు. అక్కడ నుంచి వాళ్లు పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లాంగ్‌టర్మ్ వీసాలపై ఉన్న వారికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి వచ్చే ఆదేశాల కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. మెడికల్ వీసాలపై వచ్చిన వాళ్లు మంగళవారం నాటికి దేశం వదలాల్సి ఉంది. ఈ కేటగిరీకి చెందిన వాళ్లు నగరంలో ఎవరూ లేరని అధికారులు చెబుతున్నారు. కేంద్రం నిర్దేశించిన గడువు తర్వాత చిక్కే పాకిస్థానీలను అరెస్టు చేస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క నగరంలో ఎవరైనా అక్రమంగా నివస్తున్నారా? అనే దానిపైనా దృష్టి పెట్టారు.

ఆర్థిక ఇబ్బందులు.. ఆపై లోన్‌యాప్ వేధింపులు..

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో పాటు లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు అధికమవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీకి చెందిన సుమన్ (31) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. గత ఎనిమిది నెలల క్రితం ఝాన్సీ అనే యువతితో వివాహం జరిగింది. తన సోదరులు పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 25 సాయంత్రం 4.30 గంటలకు ఇంట్లో వారంతా మూసాపేటలో తమ కుటుంబ శుభకార్యానికి వెళ్లి అర్ధరాత్రి 2.30 గంటలకు తిరిగివచ్చారు. సుమన్ భార్య ఝాన్సీ మూసాపేటలోనే ఆగిపోగా మిగతా కుటుంబ సభ్యులంతా ఇంటికి వచ్చారు. ఎవరి గదుల్లోకి వారు వెళ్లి నిద్రపోయారు. సుమన్ ఒంటరిగా తన గదిలో పడుకున్నాడు. శనివారం ఉదయం 9.30 గంటల వరకు కూడా సుమన్ గది నుంచి బయటకు రాకపోవడంతో సోదరుడు పవన్ ఫోన్ చేసినా లిఫ్ట్‌చేయలేదు. తలుపు కొట్టినా తీయకపోవడంతో పొరుగువారి సహాయంతో గది తలుపులు పగులగొట్టి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి సుమన్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అయితే కొన్ని నెలల నుంచి సుమన్ ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడని, లోన్‌యాప్‌లతో పాటు ఇతర వ్యక్తుల నుంచి రుణం తీసుకున్నాడని, వారు రుణం తీర్చమని నిరంతరం హింసిస్తుండడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర బది'లీలలు'!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పరస్పర బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో రెండు మూడు నెలలు/రోజుల్లో పదవీ విరమణ చేయాల్సిన వారు కూడా పరస్పర బదిలీ పేరుతో ఇతర జిల్లాలకు వెళ్తుండడం సందేహాలకు తావిస్తోంది. ప్రతిఫలంగా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే సర్వీసు ఎక్కువ ఉన్న వారి నుంచి 'పెద్ద మొత్తంలో' లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని అడ్డుకోవాల్సిన ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారులు పరోక్షంగా ఇందుకు సహకరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి స్థానికేతరుల కోటా 20 శాతానికి మించకూడదు. కానీ జిల్లాలో ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చి చేరిన వారితో స్థానికేతరుల కోటా 50 శాతం దాటిపోయింది. స్పౌజ్ కోటాలో ఇప్పటికే 32 మంది ఉపాధ్యాయులు జిల్లాకు రాగా, తాజాగా పరస్పర బదిలీల ప్రక్రియలో భాగంగా మరో 112 మంది వచ్చి చేరినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇప్పుడెందుకు వెళ్తున్నట్లు?

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4,054ఎస్‌జీటీలు, 3,997 స్కూల్ అసిస్టెంట్లు, 278 మంది హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, 200 మంది ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పని చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులను స్థానికత ఆధారంగా ఆయా జిల్లాలకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని కొంత మంది ఉపాధ్యాయులకు స్థానికత ఉన్నప్పటికీ సీనియారిటీ లేకపోవడంతో ఇతర జిల్లాలకు కేటాయించింది. ఇందులో భాగంగా ఆమనగల్లు మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని నాగరకర్నూలు జిల్లాకు కేటాయించింది. ఆయన ఇప్పటి వరకు రిలీవ్ కాలేదు. తనకున్న ఆర్థిక, రాజకీయ పలుకుబడితో నాలుగేళ్లుగా ఇక్కడే కొనసాగుతూ వచ్చారు. మరో మూడు రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సర్వీసు ముగిసే సమయంలో ఆయన పరస్పర బదిలీల్లో భాగంగా వికారాబాద్‌కు వెళ్తున్నారు. ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లాకు చెందిన సర్వీసు ఎక్కువగా ఉన్న మరో ఉపాధ్యాయురాలు జిల్లాకు వచ్చారు. పరస్పర బదిలీల్లో భాగంగా ఇద్దరి మధ్య పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 25 మంది వరకు పరస్పర బదిలీల్లో వెళ్లి.. అటు నుంచి వచ్చే వారి నుంచి భారీగా 'పుచ్చుకున్నట్లు' తెలిసింది. నిజానికి సర్వీసు ముగింపు దశలో ఉన్న వారిని రిలీవ్ చేయకూడదు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఆరోగ్య సమస్యలు, పిల్లల ఉన్నత చదువుల పేరుతో ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలు సహా ప్రజాప్రతినిధుల బంధువులు రాజకీయ, ఆర్థిక పలుకుబడిని అడ్డంపెట్టుకుని డిప్యూటేషన్‌పై జిల్లాకు వస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కాకుండా, ఇంటికి సమీపంలో, తక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లలో (ఫోకల్) పోస్టింగ్‌లు పొందుతున్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే చదువుకుని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఎంపికైన వారు ఇతర మండలాల్లోని నాన్ ఫోకల్ పోస్టుల్లో పని చేయాల్సి వస్తోంది. సీనియార్టీ పేరుతో పదోన్నతులను కొల్లగొడుతున్నారు. ఈ విషయం తెలిసి కూడా ఒక్క ఉపాధ్యాయ సంఘం కూడా అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. జిల్లాలో ఇప్పటికే 20 వేల మందికిపైగా బీఈడీ, టెట్ అర్హత పరీక్షలు పూర్తి చేసుకుని డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం పోస్టుల భర్తీకి రెండు మూడేళ్లకోసారి నోటిఫికేషన్లు జారీ చేస్తే.. ఆయా సమయాల్లో ఖాళీ లేక జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరకని పరిస్థితి నెలకొంది.